క్లుప్తంగా

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ప్రాంగణంలో గల కళావేదికపై ప్రతి నెలా నిర్వహించే సంగీత సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సంగీత విభావరి అలరించింది. ఆలిండియా కళారంగం, ప్రకాశం జిల్లా పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. కళాపోషకులు మద్దుల నరసింహారావు, వెంకట సుబ్బమ్మ దంపతులను సత్కరించారు. సాయంత్రం ఐదు గంటలకు సరస్వతీపూజ, దీప ప్రజ్వలనతో ప్రారంభమైన సంగీత విభావరి నిర్విరామంగా ఐదు గంటలపాటు సాగింది. పలువురు గాయనీ గాయకులు పాటలు పాడి శ్రోతలను మైమరపించారు. సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేద గాయని పద్మకు సయ్యద్ ఇస్మాయిల్ ఆర్థికసాయం అందించారు.

గుడి నిర్మాణానికి మారం విరాళం



విరాళం అందిస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి సోమవారం గుడి నిర్మాణానికి రూ.50,116 విరాళం అంజదేశారు. చీమకుర్తిలోని తన నివాసంలో నిర్మాణ కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందించారు. చినగంజాం మండలం మన్నంవారిపాలెం గ్రామానికి చెందిన పోలేరమ్మ తల్లి కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణానికి విరాళం అడగడంతో వెంకారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వెంకారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిస్టు నేతకు నివాళి



మిడసల వెంకటసుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు మెట్రో: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మిడసల వెంకట సుబ్బయ్య 21వ వర్ధంతి సందర్భంగా నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగస్థల, సాహిత్య సంస్థల ప్రతినిధులు వెంకట సుబ్బయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షత వహించగా, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, సీపీఐ నాయకుడు పీవీఆర్ చౌదరి, కార్మిక నేత షేక్ సర్దార్, లలితకళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, కరవది సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాద్, కొప్పోలు వెంకటేశ్వర్లు, గుంటూరు సత్యనారాయణ, దేవరశెట్టి సింగయ్య, యు.వి.రత్నం, అయినంపూడి నరసింహం, షేక్ అజీష్, నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు భరోసా కార్యక్రమం

యర్రగొండపాలెం: రైతు భరోసా–పీఎం కిసాన్ ఐదో సంవత్సరం రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం యర్రగొండపాలెంలో నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



పిల్లి ప్రదీప్

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల ఉపాన్యాసకుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న పిల్లి ప్రదీప్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. అమితావ్ ఘోష్ నవలలో ఎంపిక చేసిన సామాజిక సమస్యలపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ లభించింది. గతంలో ప్రదీప్‌ను జ్యోతిరావు పూలే సేవారత్న, అంతర్జాతీయ టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డులు వరించాయి.

రక్తదానానికి సహకరించండి

దర్శి: రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ దర్శి చైర్మన్ దొంగరి రమేష్ కోరారు. స్థానిక ఆ కార్యాలయంలో సోమవారం నూతన కమిటీ ఎన్నిక అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ రమేష్ మాట్లాడారు. నూతన కమిటీలో అందరూ సహృదయం, సేవా భావం గల వారేనని అన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో రక్తం కోసం ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే సీఎం

- ఎందుకు కావాలనే విషయాన్ని ప్రజలకు వివరించాలి
- ఇచ్చిన పథకాలన్నింటినీ మరోసారి గుర్తుచేయాలి
- పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయాలి
- ప్రతి ఇంటి ముందు వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయాలి
- కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: రాష్ట్ర ప్రజలకు సువర్ణపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి ఎందుకు కావాలో ప్రతి వ్యక్తికి వైఎస్సార్ సీపీ శ్రేణులు వివరించాలని కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పిలుపునిచ్చారు. మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలనే కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులకు స్థానిక వాసవీ కల్యాణ మండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ ఆళ్ల రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించగా, ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేశారన్నారు. ప్రతి ఇంట్లో ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరి ఆర్థికంగా ఎదిగారన్నారు. ఎంతో మంది ముఖ్యమంత్రులు పనిచేశారుగానీ.. సామాజిక న్యాయం అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. సీఎం జగన్ మాత్రం న్యాయపాలన, అవినీతిలేని పాలన అందించారని కొనియాడారు. ఇన్ని పనులు చేశారు కాబట్టే మళ్లీ జగనే సీఎం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 9 నుంచి 21వ తేదీ వరకు ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇంకా ఏం కావాలో నోట్ చేసుకోనున్నట్లు చెప్పారు. వారు అనుమతిస్తే పార్టీ జెండా కూడా ఇంటి ముందు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక కాలనీకి వెళ్లి అక్కడ సమస్యలు తెలుసుకోవడం, ఆ రాత్రి అక్కడే నిద్రించడం జరుగుతుందన్నారు. మా నమ్మకం నువ్వే జగన్, నేను ఇచ్చిన మాట తప్పను అనే బ్రోచర్‌లో ఉన్న 2014లో చంద్రబాబు ఇచ్చి నెరవేర్చని హామీలు, పథకాలు, 2019లో జగన్ ఇచ్చి నెరవేర్చిన పథకాలు, హామీల గురించి వివరించారు. రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి మాట్లాడుతూ మత్స్యకారులకు అమలు చేసిన పథకాల గురించి మరోసారి తెలియజేసి మళ్లీ జగన్ సీఎం ఎందుకు కావాలో వివరించాలన్నారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చానని భావిస్తేనే మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త కట్టా శేఖర్ మాట్లాడుతూ తమది పాదర్తి గ్రామంలో రేషన్ షాపు అని, గతంలో దూర ప్రాంతాల నుంచి వచ్చి సరుకులు తీసుకెళ్లేవాళ్లని, జగన్ సీఎం అయిన తర్వాత ఇంటి వద్దకే వచ్చి వాహనం ద్వారా సరుకులు ఇస్తున్నారని తెలిపారు. మూడు జిల్లాల మత్స్యకార కార్మిక సంఘ అధ్యక్షుడు గొల్లపోతు నాగార్జున మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చిన్న పనిస్తే ఎంతో ఆర్భాట ప్రచారం చేసుకుంటారని, కానీ, మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తుంటే సరిగ్గా ప్రచారం చేయడం లేదని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసి ప్రచారం ఊపందుకునేలా చూడాలని కోరారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్, నేను ఇచ్చిన మాట తప్పను కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, కోడూరి వెంకటరెడ్డి, శైలేష్, కుసుకుర్తి వెంకట్రావు, సర్పంచ్ పురిణి గోపి, గుడి నాగిరెడ్డి, కొండూరి గోవిందు, గాదె కోటిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాపంచలైన నిందలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబంపై బురద చల్లాలని చూశారు
- భూ కబ్జాలు, నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారాన్ని అంటించాలని ప్లాన్ చేశారు
- కానీ, అవన్నీ బూటకపు ఆరోపణలేనని తేలాయి
- అభివృద్ధిపైనే ఎమ్మెల్యే బాలినేని దృష్టి
- టీడీపీ వాళ్లకు అది నచ్చకే లేనిపోని ఆరోపణలు
- విలేకరుల సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ధ్వజం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన కుటుంబం మీద టీడీపీ నాయకులు వేసినవన్నీ నిందలేనని తేలిందని, కలెక్టర్, ఎస్పీ ప్రెస్‌మీట్‌తో ఆ నిందలన్నీ పటాపంచలయ్యాయని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత వివరించారు. బాలినేనికి గానీ, బాలినేని కుటుంబానికిగానీ భూ కబ్జాలతో ఎలాంటి సంబంధం లేదని కలెక్టర్, ఎస్పీ తేల్చారని, కడిగిన ముత్యంలా బాలినేని రాజకీయ జీవితం ఉందని అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణతో కలిసి సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. పచ్చ మీడియా, పచ్చ పార్టీలు అదే పనిగా పనికట్టుకుని మచ్చలేని నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి మీద, ఆయన కుటుంబం మీద లేనిపోని ఆరోపణలు చేసి బాలినేనిని క్షోభకు గురిచేశారన్నారు. అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బాలినేనికి భూ కబ్జాలు, నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారాలను అంటగట్టాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు. బాలినేని మీద, ఆయన వెంట ఉండే నాయకుల మీద లేనిపోని ఆరోపణలు చేయడాన్ని పనిగా కొందరు పెట్టుకున్నారన్నారు. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మీద కూడా బురదజల్లే ఆరోపణలు చేశారన్నారు. ఆయన కార్పొరేటర్‌గా, డిప్యూటీ మేయర్‌గా ప్రజలకు మంచి పనులు చేసుకుంటూ బాలినేనికి అండగా ఉంటుంటే.. ఆయనపై కూడా బురదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూముల విషయంలో కూడా నీచ రాజకీయాలు చేశారని మేయర్ మండిపడ్డారు. టీడీపీ వాళ్లకు అభివృద్ధి చేయడం చేతగాక, అభివృద్ధి చేస్తున్న వారిని ఏ విధంగా మానసికంగా హింసించాలనే దానిపై దృష్టి సారించారని అన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ మీద కూడా భూ కబ్జాల ఆరోపణలు చేశారంటే.. వాసన్న పక్కన తిరిగే నాయకులను మానసికంగా ఇబ్బందిపెట్టి వారందరినీ వాసన్న నుంచి దూరం చేయాలన్న కుట్ర పన్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు, కుయుక్తులు, కుళ్లు రాజకీయాలు చేసినా.. ఏ ఒక్కరూ బాలినేని శ్రీనివాసరెడ్డిని విడిచివెళ్లరని స్పష్టం చేశారు. పచ్చ మీడియాను అడ్డంపెట్టుకుని పచ్చ పార్టీలు కుయుక్తులు పన్నడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు ఈదర సురేష్‌బాబు, వేమూరి భవాని, నీలంరాజు సరోజ పాల్గొన్నారు.

వర్షం నీరు సజావుగా పోయేలా చర్యలు

- పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ వెంకటేశ్వరరావు



రామ్‌నగర్‌లో వర్షం నీటిని తొలగించే పనులు చేయిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: అకాల వర్షాలకు రోడ్లపై చేరిన నీరు సజావుగా వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆ మేరకు సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. రామ్‌నగర్, సంతపేటతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం నీరు సక్రమంగా వెళ్లకుండా రోడ్లపై నిలబడి ఉండటంతో శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిని పురమాయించారు. కొన్ని చోట్ల జేసీబీల సాయంతో వర్షం నీరు మురుగు కాలువల్లోకి తరలించే పనులు చేపట్టారు. కర్నూలు రోడ్డు, కొప్పోలు రోడ్డు, ట్రంకు రోడ్డుతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అదేవిధంగా ముక్తినూతలపాడు సచివాలయం పరిధిలో పర్యటించి పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను, కుళాయి పన్ను, క్లాప్ యూజర్ ఫీజులు వసూలు చేశారు. కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం నుంచి రావాల్సిన ఆస్తి పన్ను రూ.11,62,381 వసూలు చేశారు. కిమ్స్ యాజమాన్యం స్వయంగా కమిషనర్‌కు చెక్కు అందజేశారు.

నేడు ఆచార్య ఎన్‌జీ రంగా జయంతి సభ

ఒంగోలు సెంట్రల్: ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ రైతాంగ ఉద్యమ నేత ఆచార్య ఎన్‌జీ రంగా 123వ జయంతి సభను మంగళవారం స్థానిక సంత పేటలోని రంగా భవన్‌లో నిర్వహిస్తున్నట్లు కిసాన్ సంస్థ కమిటీ అధ్యక్షుడు ఆళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు



కలెక్టర్‌తో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు సోమవారం ప్రకాశంభవనంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు ప్రత్యేక చొరవతో పరిష్కరిస్తున్నందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ట్రెజరర్ దానియేలు, కలెక్టరేట్ అధ్యక్షుడు పూతకోలు శ్రీనివాసరావు, సెక్రటరీ వెంకటశ్వరరాజు తదితరులు ఉన్నారు.

వార్తలకే పడిపోయేంత బలహీన ప్రభుత్వమా..?



సభలో ప్రసంగిస్తున్న చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకునే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం న్యూస్‌క్లిక్ పత్రికపై అక్రమ కేసులు బనాయించిన తీరు చూస్తుంటే.. వార్తలకే పడిపోయేంత బలహీనంగా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు విమర్శించారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో న్యూస్‌క్లిక్‌పై నమోదైన కేసుల ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చుండూరి ప్రసంగిస్తూ దేశంలో రైతాంగ ఉద్యమాన్ని అణచివేసేందుకే రైతాంగానికి మద్దతుగా నిలిచిన న్యూస్‌క్లిక్ పత్రికపై బీజేపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించిందని మండిపడ్డారు. రైతాంగానికి మద్దతుగా నిలబడిన పత్రికలను, జర్నలిస్టులను, ప్రజాసంఘాలను లక్ష్యంగా చేసుకుని జైలుకు పంపుతుందన్నారు. చైనా నుంచి సదరు పత్రికకు నిధులు అందుతున్నాయన్న తప్పుడు ఆరోపణలతో కేసుల మోపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బేషరతుగా న్యూస్‌క్లిక్ యాజమాన్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉక్కు పరిశ్రమపై రెండు నాలుకల ధోరణి విడనాడాలన్నారు. కార్మిక, రైతాంగ విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బీజేపీది అరాచకపాలనగా ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ అభివర్ణించారు. ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్న బీజేపీని ప్రజలు తిరస్కరించాలని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. సభలో రైతు సంఘాల నాయకులు వడ్డే హనుమారెడ్డి, ఎంఎస్ సాయి, సుబ్బారావు, కరవది సుబ్బారావు, వి.బాలకోటయ్య, ఎస్‌డీ సర్దార్, పీవీఆర్ చౌదరి, హరికృష్ణ తదితరులు ప్రసంగించారు.

ప్రభంజనం సృష్టించిన పాదయాత్ర



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్, కార్యకర్తలు

నాగులుప్పలపాడు: ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి జననేత జగనన్న చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్ర సృష్టించిందని మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహించి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఈదుమూడి గ్రామంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ ఆనాడు పాదయాత్ర చేపట్టడం అనేది రాష్ట్ర ప్రజల ఆవశ్యకత అని అన్నారు. ఆ పాదయాత్రలో పేదల కష్టాలు చూసిన జగనన్న.. నేడు వారి ఆశలకు అనుగుణంగానే పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, బొజ్జా దానియేలు, సాంబయ్య, అక్కేసు, హైమారావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి గొర్రెల దొంగతనం

నాగులుప్పలపాడు: దొడ్డిలో తోలిన గొర్రెల మందలో సగం గొర్రెలను పక్కకు తప్పించి వాటిలో కొన్నింటిని దొంగతనంగా వాహనాలు ఎక్కించి మరికొన్నింటిని వాహనాలలో పట్టక ఘటన స్థలంలోనే దొంగలు వదిలివెళ్లిన ఘటన ఉప్పుగుండూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల సమాచారం మేరకు ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మద్దిసాని శ్రీనివాసరావుకు చెందిన గొర్రెల కొష్టం అయ్యప్ప స్వామి గుడిబజారులో చివరన ఉంటుంది. ప్రతిరోజూ పొలం నుంచి వచ్చిన తర్వాత గొర్రెలను దొడ్డిలోకి తోలి ఇంటికి వస్తుంటారు. ఈ క్రమంలో 100కు పైగా గొర్రెలను ఆదివారం రాత్రి దొడ్డిలోకి తోలి పొద్దుపోయిన తర్వాత శ్రీనివాసరావు ఇంటికి వచ్చి నిద్రపోయాడు. అనంతరం సోమవారం వేకువజామున గొర్రెల మంద దగ్గరకు వెళ్లిన శ్రీనివాసరావు దొడ్డి తడికలు తీసి ఉండటం గమనించాడు. సుమారు 40 గొర్రెల వరకు మందలో కనిపించకపోవడంతో సమీపంలో అంతా వెతికారు. నాగన్నవాగు సమీపంలో 10 గొర్రెలు తిరుగుతున్నాయని తెలిసిన వారు చెప్పగా, అక్కడ పరిశీలించి సుమారు రూ.7 లక్షల విలువైన 30 వరకు గొర్రెలను వాహనాల్లో ఎక్కించుకుని మిగతా 10 గొర్రెలు పట్టకపోవడంతో అక్కడే వదిలేసిపోయినట్లు నిర్ధారించుకున్నారు. గొర్రెల దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్న బాధితుడు శ్రీనివాసరావు గొర్రెల దొంగతనంపై నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

212 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాల వద్ద అధికారులు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు వద్దగల లక్ష్మీగణపతి రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 212 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కె.అశోక్‌కుమార్ తెలిపారు. దర్శి – అద్దంకి ప్రధాన రహదారిలో పసుపుగల్లు వద్ద ఉన్న రైస్ మిల్లులో అక్రమ రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో ఆదివారం అర్ధరాత్రి దాడి చేశామన్నారు. దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి సోమవారం పసుపుగల్లు వీఆర్వో సుశీలకు అప్పగించామన్నారు. మిల్లు నిర్వాహకులు రాంబాబుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసును ఆర్డీఓ కోర్టుకు పంపినట్లు తెలిపారు. దాడుల్లో సింగరాయకొండ, పొదిలి, యర్రగొండపాలెం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు కృష్ణమోహన్, డేవిడ్‌రాజు, ముస్తాక్, వీఆర్‌ఏ యేసు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా సంకల్ప యాత్ర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రరెడ్డి, నాయకులు

కొత్తపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర పూర్తి చేసుకుని ఆరేళ్లు అయిన సందర్భంగా కొత్తపట్నం మండల వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగనన్న సచివాలయాల కన్వీనర్ ఆళ్ల రవీంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో అనేక సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అటువంటి నాయకుడిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సినన అవసరం ఉందన్నారు. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్ర 3,640 కిలోమీటర్లు జరిగిందని, సుదీర్ఘ పాదయాత్ర పూర్తిచేసి ప్రజల సమస్యలు తెలుసుకున్న ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతం అమలు చేశారని తెలిపారు. ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది



వైద్యాధికారులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దొనకొండ: గ్రామాల్లో రైతులు సుభిక్షంగా జీవిస్తుంటే రాజ్యం బాగుంటుందని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించగా, ఎంపీపీ ఉషామురళి అధ్యక్షత వహించి మాట్లాడారు. నాడు రాష్ట్రం ఎలా ఉండేది, నేడు రాష్ట్రంలో ప్రజలు ఎలా జీవిస్తున్నారు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలా ఉన్నాయనే విషయాలను వివరించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అందించారని తెలిపారు. అలాంటి సీఎంని మనం మర్చిపోకుండా మళ్లీ సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిని ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు, శాలువలు, బొకేలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ మార్టిన్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, తహసీల్దార్ ఎం.సువర్ణ, ఈఓఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ సాంబశివరావు, వైద్యాధికారులు ఎం.సునీత, పి.సునీత, మండల కన్వీనర్ కందుల నారపురెడ్డి, జెడ్పీటీసీ మురికిపూడి సుధాకర్, సచివాలయ మండల కన్వీనర్ గుంటు పోలయ్య, జిల్లా అధికార ప్రతినిధి గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షురాలు మిండాల మంగమ్మ, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదు

- ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ హెచ్చరిక

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధులను ఉద్యోగులు చిత్తశుద్ధితో నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఓటరు జాబితా సవరణకు సంబంధించి క్లెయిమ్స్ పరిష్కారంపై స్పందన భవనంలో ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని స్పష్టం చేశారు. ఒంగోలులో ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న నేపథ్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రెండు వారాల తర్వాత ఒంగోలు నియోజకవర్గంపై సమీక్షిస్తానని, అప్పటికీ నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, ఏఈఆర్‌ఓలు మురళి, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసంపై కేసు నమోదు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తురకపాలెం పొలాల్లో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో విద్యుత్ శాఖ ఏఈ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వైపీ రమణయ్య తెలిపారు. తురకపాలెం గ్రామానికి చెందిన చంద్రగిరి వెంకటరెడ్డి, పంది కోటిరెడ్డి పొలాల్లో గల 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఏడు వేల విలువ గల రాగి తీగ అపహరించుకుపోయారు. సంబంధిత రైతులు ఏఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.